# 66. అతి సారా వ్యాధి

ఓ రోజు సాయంకాలం ఏడుగంటలవుతూ వుండగా నాగశాస్త్రులు మా ఇంటి కొచ్చేడు. "ఏమిటీ, ఇలా వచ్చేవు? ఎక్కడినుంచి? రా, ఇలా కూర్చో!" అన్నాను.

నాగశాస్త్రులు నవ్వేడు.

"కూచోమంటే నవ్వుతావేం?"

"బాపుగారి జోకొకటి గుర్తొచ్చి" అన్నాడు.

"చెప్పు, చెప్పు!" అన్నాను.

"అదుగో మళ్లీ! మొహం వేపు చూస్తూ చెప్పు అంటావేమిటి? నా మొహం నీకు చెప్పులాగ కనిపిస్తోందా?"

"లేదులే. జోకేమిటో చెప్పమని కంగారుగా అనడంలో అలా వొచ్చింది, మాట. జోకేమిటో చెప్పు - అదే, వివరించు"

"ఏం లేదు. ఓ కుర్రాడేమో అతని గర్ల్‌ఫ్రెండుని పార్కుకి రమ్మని మెసేజి పంపించి, అనుకున్న టైముకి ఐదు నిమిషాలు ముందుగా తను అక్కడికి చేరేడట. ఆ గర్ల్ ఫ్రెండ్ అనే పదార్థం వస్తే కూచోమని ఆపేక్షగా, లవ్వుగా చెప్పాలి కదా అని, ఆ ఒక్కమాటనీ అయిదు నిమిషాల పాటు తీవ్రంగా రిహార్సలు వేసుకున్నాట్ట.... ఆ అమ్మాయి రాగానే; "ఒచ్చేవా వసంతా! రాయిలా కూర్చో"- అన్నాట్ట ఆ అబ్బాయి. ఆ అమ్మాయి "నేను నీ కంటికి రాయిలా కనపడుతున్నానా? గువ్వలా ఒదుగుతాను. గవ్వలా వాగుతాను. చిలకలా కులుకుతాను. అంతేగాని రాయిలా కూర్చోను!" అని చెప్పేసి వెళ్ళిపోయిందిట. మొన్నా మధ్య టీవీలో చూపించేరు. నువ్వు చూళ్ళేదా?"

"చూళ్లేదే! టీవీ అంటే నాకు చిరాకుండడం వల్ల అప్పుడప్పుడొచ్చే ఇలాంటి మంచి ప్రోగ్రాంలు మిస్సయిపోతుంటాను."

"టైమెంతైంది?"

"ఇంకా ఏడవలేదు"

"ఏడవడం గురించి కాదు, నేనడుగుత. టైము ఎన్ని గంటలైందని."

నేను లెంపలు వేసుకున్నాను. "టయిము ఇంకా ఏడు గంటలు అవలేదు." అని స్పష్టంగా విడమర్చి చెప్పేను. "ఎప్పుడో గాని రానివాడివి ఏదో, ఇవాళ వేళా విశేషం ఏమిటోగాని నీకు నన్ను ఓసారి పలకరించాలని అనిపించింది ఒచ్చేవు. ఇంక టైము గొడవ ఎందుకులే?" అని కూడా నాగశాస్త్రుల్ని సముదాయించేను.

"ఏడవగానే టీవీలో తెలుగు సీరియల్ మొదలవుతుంది. లేదా టీవీలో తెలుగు సీరియల్ మొదలవగానే ఇళ్లల్లో ఏడవడం జరుగుతుందని కూడా చెప్పవచ్చు. ఈ దారంట వెళుతూంటే

టీవీలో తెలుగు సీరియల్ వేళకి ఇంటికి చేరకుండా వుండడం యెలాగా అని బెంగతో వుండగా సమాధానంలాగా మీ ఇల్లు ఇక్కడే అని గుర్తొచ్చి ఇక్కడ ఆగేనన్నమాట. నేను అల్లంత దూరంలో వుండగా నువ్వు ఎవర్నో సాగనంపుతూ మీ గేటు దగ్గిర నిలబడేసరికి నువ్వు ఇంట్లోనే వున్నావని తెలిసింది."

"ఎవర్నో కాదు. రంగారావని, మా ఆఫీసులో సీనియర్ అసిస్టెంటు. సాయంకాలం అయ్యే సరికి సాయంగా సీసా వుండాలతనికి"

"అదేం జబ్బూ?"

"అతిసారా వ్యాధి అంటారు దాన్ని. యాభై రూపాయలు అప్పు కావాలని వొచ్చాడు. నా దగ్గర లేవు. తన్ని పంపించడానికి గేటుదాకా వచ్చానన్నమాట."

"అప్పివ్వకపోతే పోయావుగాని తన్ని పంపించడమెందుకూ?"

"అబ్బ! ప్రతీదానికీ వికటార్థం తీస్తావు. నీతో వేగలేక చస్తున్నాను. నాదగ్గిర - యాభై రూపాయలు - లేవని - చెప్పి తనని పంపించడానికి గేటు దాకా వచ్చేను!" అని స్పష్టం చేసేను.

నాగశాస్త్రులు దీర్ఘంగా మూలిగేడు.

"హుఁ-ఇవాళ ఎక్కడి కెళ్లినా చుక్కెదురే అవుతోంది కాబోలు, నాకులాగే అతనికీని"

"ఎవరా చుక్క? చక్కందా, చిక్కందా? చక్కనమ్మ చిక్కినా అందం అన్నారుగాని నిజానికి చిక్కకపోతేనే అందం."

"చుక్కంటే అది మనిషి కాదు. స్టారు అసలే కాదు. నువ్విందాక అన్నావే, అతిసారా వ్యాధని! ఆ చుక్క".

"అంటే, మందా?"

"మందా కాదు, గుంపూ కాదు, మందు."

"ఒర్నీ! ఎక్కడికెళ్లినా మందు ఎదురవుతోందా?"

"అడక్కు, ఇదంతా మా ముకుందంగాడు చేసిన నిర్వాకం!"

"ఏం చేశాడేమిటి?"

"చెప్తా. ఏదో ఫైలు మీద స్పీక్ అని రాసుంటేనూ, మధ్యాన్నం లంచి టైమ్ దాటేక మా బాస్ గారి దగ్గరికి వెళ్లేనన్నమాట".

"బాస్ గారు - అనక్కర్లేదు, బాస్ అనేదాంట్లో "గారు" ఉంది. అలాగే మేడమ్ గారు - అని కూడా అనక్కర్లేదు. సార్‌లో అయ్యగారున్నట్టే మేడమ్‌లో అమ్మగారు అనేదుంది."

"బాస్ దగ్గిరి కెళ్లాను - అన్నాననుకో ; అతనూ నేనూ ఏదో ఇంటిమేటుగా వున్నాం అనుకుని-"

"ఇంటిమేటేమిటి, క్లాస్‌మేటూ, రూంమేటూ లాగా? అతనూ నువ్వూ ఓ ఇంట్లో రెండు వాటాలు అద్దెకి తీసుకుని కాపరాలుంటే ఇంటిమేట్స్ అవుతారనుకో - కాని అతనెక్కడ, నువ్వెక్కడ! నక్కకీ నాగలోకానికి వున్నంత తేడా వుంది మీకిద్దరికీనీ"

"నాపేరు నాగశాస్త్రులు కనక నీ ఉద్దేశంలో అతనొక నక్క అన్నమాట. ఈ మాట

నువ్వన్నావు గనక సరిపోయింది గాని మా ఆఫీసులో ఎవరైనా అనుంటే పెద్ద గొడవైపోను!''

"ఇంతకీ ముకుందం ఏం చేసేడో చెప్పేడువు!"

"వెనకటికెవరో భోజనంలో ఏం పెట్టారని అడిగితే - "ఏడన్నం, ఏడిశారు - '' అన్నాట్ట. సరే ఫైలు మీద బాస్ రాసిన ప్రకారం "స్పీకి" సీట్లో కొచ్చేసరికి అక్కడొక చీటీ వుంది - "ఒరేయి, నువ్వు సాయంకాలం ఓసారి మాఇంటికి రావాలి - అని''

"ఇట్లు, నీ ముకుందం - అని కూడా వుందా?''

"ఆ అవసరం ఏమీ వుండదు మా ముకుందం విషయంలో... ఆ మధ్య ఎవరో ఒకాయన చనిపోతే డాక్టరుగారు చనిపోయినతని దగ్గిరి బంధువుతో -డెత్ సర్టిఫికేటు రాసిమ్మంటారా- అని అడిగేట్ట. అక్కర్లేదు! ఈయనకి మీరు వైద్యం చేసినట్టు సర్టిఫికేట్ ఇవ్వండి, చాలు - అన్నాట్ట ఆ బంధువు. అలాగ్గా, మా ముకుందం దస్తూరీ యే అతని సంతకం! నాకు తెలిసినంత వరకూ ఇంగ్లీషుగాని, తెలుగుగాని - అక్షరాల్ని అంత కొక్కిరి బిక్కిరిగా రాయగలిగేవాడు మరొకడు లేడు గాక లేడు! ఓసారి ఏమైందో తెలుసా? మా ముకుందం వాళ్లాఫీసు ఫైలు ఒకదాంట్లో ఒక నోట్ రాసి పుటప్ చేస్తే వాళ్లాఫీసరు ఆ నోట్ చివర "ఇండి సైఫరబుల్" అని రాసి సంతకం పెట్టేశాడు. అది పుచ్చుకుని ముకుందం ఆయన దగ్గిరి కెళ్లి - "సార్! ఇదేదో రాస్సేరండి, నాకు బోధ పళ్లేదు సార్-'' అన్నాడు. "నువ్వు రాసింది నాకూ బోధపడలేదు నాయనా! అదే ఆ మాటకి అర్థం!'' అని చెప్పేడాయన. "ఒరే ముకుందం, నీ దస్తూరీ కొంచెం ఇంప్రూవ్ చేసుకోరా,'' అంటే, నీలాగా అక్షరాలు కుదురుగ్గా తెలిసిపోయేటట్టుగా రాస్తే స్పెల్లింగు తప్పులు బయటపడిపోతాయి. అప్పుడు మరింత అవమానం - అన్నాడు!''

"పిట్టకథలో పడి అసలు కథ మరిచిపోతున్నావు. నేను గుర్తు చెయ్యనా?''

"గుర్తు అనేది 'పెడతారు' గాని 'చెయ్యరు'. ''

"పోనీ జ్ఞాపకానికి తెస్తాను?''

"అలా అన్నావు, బావుంది. తే''

"నువ్వు మీ బాస్ దగ్గిర్నించొచ్చేసరికి ముకుందం రాసిన చీటీ టేబిలుమీద వుంది. దాంట్లో రాసున్న ప్రకారం నువ్వతనింటికి సాయంకాలం వెళ్లేవా, లేదా?''

"వెళ్లేను, తలుపు కొట్టిన కొంతసేపటికి వాళ్లమ్మాయొచ్చి తలుపు తీసింది.....''

★ ★ ★

"నాన్న ఉన్నాడా, మ్మా?'' అనడిగేను.

"ఉన్నారండి, రం-డి లా- కూర్చోండి''

"నయమే! రాయిలా కూచోమన్లేదు కదాని సంతోషించేను. ఆ జోకు చెప్దామనుకునే లోగా ఆ అమ్మాయి లోపలికెళ్లిపోయింది.

కొంతసేపయింది.

ముకుందం యివతలికి రాలేదు. ఈ అమ్మాయి వెళ్లి నాన్నా, నీకోసం ఫలానా వారొచ్చేరని గాని అసలెవరో తన కోసం వచ్చేరని గాని, రాయిలా కూర్చున్నారని గాని ముకుందంతో చెప్పిన అలికిడి లేదు.

హాల్లో ఎవరూ లేరు. కనుచూపు మేర అంటే ఎంతో లేదు గనక అక్కడెవరూ లేకపోవడం పెద్ద విశేషం ఏమీ కాదుగాని అసలు వినికిడి దూరంలోనే ఎవరూ తిరుగుతున్న సందడి లేదు. గిన్నెలూ, గ్లాసులూ, చెమ్చాలు పళ్లాలు సర్దుతున్న చప్పుడుగాని బియ్యమో, పెసరపప్పో చేటలో పోసి చెరుగుతున్న సవ్వడిగాని , రేడియో, టేపురికార్డుల్లో దేనిదైనా ధ్వనిగాని లేదంటే లేదు. ఎంతసేపలా కూర్చోడం? ఇంటికి రారా అని పిల్చిన పెద్దమనిషి ఏ విధమైన ఎదురు సన్నాహాలు చెయ్యకపోతే పోయేడుగాని ఎక్కడో దాక్కుని వుంటే ఎలాగు? స్నానం చేస్తున్నాడేమో అనుకుంటే ఆ రకమైన గలగలా వినబడ్డం లేదు. చప్పుడంటే చిరాకని అనుకుంటాంగాని నిజానికి నిశ్శబ్ద మంత భయంకరమూ, బోరూ అదేగాని మరొకటి లేదని నాకప్పుడు తెలిసింది... కొంచెం దగ్గి గొంతు సవరించుకుని 'సరిగమ పదనిసా' అని ఎత్తుకుందుకి సిద్ధపడి దగ్గేను. గొంతు సవరించుకోడానికి ప్రయత్నిస్తూ వుండగా - ఇందాకటమ్మాయి- అదే, ముకుందం రెండో కూతురు వచ్చింది. చేతిలో వున్న కప్పు సాసరుతో సహా టీపాయి మీద పెట్టి గిర్రుని వెనక్కి తిరిగేసి రెండగులు వేసింది. వెళ్లిపోతుందిగాబోల్రా, దేముడా- అని బెంగతో తెగించి అడిగేశాను:

"నాన్న- ఉన్నాడు కదమ్మా?" ఉన్నాడని తను ఇందాక చెప్పిన మాట రైటే కదా అని రూఢి చేసుకుందికిలాగ అడిగేనన్నమాట.

అమ్మాయి ఆగింది. కాని మొహం ఒక్కటే ఇటు తిప్పి. "ఉన్నారండి" అని చెప్పి, తలుపులు మూసివున్న సైడు రూం వేపు ఒక వేలు చూపించింది.

నేను టీ కప్పు అందుకుని, మొహం మీదికి చిన్న నవ్వు తెచ్చుకుని "మీ అమ్మగారు కనబడ్డేం?" అన్నాను.

"అమ్మ డాక్టరు దగ్గిరికెళ్లింది."

"మీ నాన్న తలుపులు మూసుకుని గదిలో ఏం చేస్తున్నాడు చెప్మా?"

ఆ అమ్మాయి ఈ సారి మొహం కూడా అటువేపు తిప్పేసుకుని, 'మందుకొడ్తున్నారండి' అని చెప్పేసి లోపలికెళ్లిపోయింది

ముకుందం మందు కొడ్తాడని తెలుసు గాని, ఏకంగా ఇంట్లోనే బార్ ఓపెన్ చేసేసేడని నాకు తెలియదు.

టీ రెండు గుక్కలు తాగ్గానే బుర్రలో ఒక ఆలోచన ఢళుక్కుమంది.

ముకుందం భార్య మందు తెచ్చుకోడానికి డాక్టరుగారి దగ్గిరి కెళ్లింది. ముకుందంగాడేమో, తను తెచ్చుకున్న మందు పుచ్చుకోడానికి గదిలో దూరేడు. ఆవిడ మందు తెచ్చుకునే లోగా వీడు మందు పుచ్చేసుకోవాలన్న కఠోర నిర్ణయం తీసుకుని దీక్షగా ఆ పనిమీద ఉన్నాడు. అంతేగాని గదిలో ఎటాచిడు బాత్‌రూంలాగ ఎటాచిడు బార్ రూం నిర్మించుకొని వుండడు.

చెప్పేనుగా, అతను మందు కొట్టడం నాకు కొత్తకాదు. ఒక్కడూ కూచునిమందు కొట్ట గలడు. ఎంత మందున్నా ఇంత మందా అన్న భయం లేకుండా మందు కొట్టగలడు. వెనకటికి మందూ అదీ బాఘా అలవాటైపోయిన ఒకావిడ - ఎంత - మందైనా నాకేం భయం లేదు -

అని డిక్లేర్ చేసిందని ముకుందమే నాకు చెప్పేడు. అలాటి ముకుందం తను మందు కొడుతూ నాకు టీ ఇప్పించి సరిపెట్టేసేడే అని బాధ పట్టుకుంది.

ఇంతలోకి ముకుందం కూతురు మళ్లీ వొచ్చింది ; " పంచదార సరిపోయిందాండీ?" అంటూనూ.

"తలుపు తియ్యమనమ్మా. నేను లోపలి కెళ్తాను." అని సైడు రూం వేపు చూపించేను.

"ఒద్దు మామయ్యగారూ. ఆ వాసన భరించలేం."

పాపం, ఆడపిల్ల కదా. అందులోనూ "సాంప్రదాయ" - "బద్ధకమైన" ఇంట్లో పుట్టి పెరిగింది. అంచేత 'మద్య' తరగతి వాసన కిట్టదు ; తనకి. అయితేనూ, చెవిటి వాళ్లు కొందరు - గట్టిగా మాట్లాడితే గాని మనకీ వినబడదనుకుని గట్టిగా మాట్లాడినట్టు - "ఆ" వాసన నేను కూడా భరించలేననుకుంటోంది, పాపం.

"ఫరవాలేదమ్మా, తలుపు తియ్యమను. నాన్న ఎందుకో రమ్మంటే వొచ్చాన్నేను. సంగతేమిటో కనుక్కొని ఏడవక ముందే ఇంటికి వెళ్లాలి" అని చెప్పేను.

"అలా అంటారా?" అని ఆ అమ్మాయి ఆ తలుపు దగ్గరికి వెళుతూ వుండగా తలుపు తెరుచుకుంది. ముకుందం ఇవతలికొచ్చి ఆ గది తలుపు మళ్లీ దగ్గరగా మూసేడు. అతని వాలకం ఎలా వుందని! ఎంతమందో కొట్టినట్టు, ఎంతమందినో కొట్టినట్టు, డీలాగా వున్నాడు.

"ఏరా, ఎంతసేపయింది, వొచ్చి?" అని పలకరించేడు.

"ఐదు నిమిషాలయ్యుంటుంది. నువ్వు మధ్యాహ్నం మా ఆఫీసు కొచ్చినప్పటికి నేను సీట్లో లేను కదా. నీ చీటీ చూసి వచ్చేనన్నమాట."

"నాన్నా, మీక్కూడా టీ ఇమ్మంటారా?" అంది అమ్మాయి.

"ఇప్పుడు టీ తాగడమేమిటి? నాకేం మతీ సుతీ లేదనుకున్నావా?" అని కసిరేశాడు ముకుందం.

నేను అప్పుడే టీ తాగేను కదా. అంచేత నాకు మతీ సుతీ లేదని ముకుందం విసురు - అని నేను అనుకోలేదు. మందు పుచ్చుకొనే వేళ కదా, టీ తాగడమేమిటి - అనే నేను అర్థం చేసుకున్నాను. "కొంచెం మంచినీళ్లో, మజ్జిగో ఇయ్యమ్మా. పాపంచూడెలా వాడిలిపోయేడో" అని దెబ్బకొట్టేను. అమ్మాయి లోపలి కెళ్లింది.

"పిలవలేకపోయేవా?" అన్నాడు ముకుందం, నా పక్క కొచ్చి కూర్చుంటూ.

"నువ్వేదో పనిలో ఉన్నావని -" అన్నాను. చీటీ రాసి ఇంటికి రమ్మని పిల్చేడు నన్ను. నాకోసం చూడ్డం మాట అటుంచి - నాగశాస్త్రులు వస్తే లోపలికి పంపించు- అని చెప్పేడయినా కాదు. గదిలో దూరి ఒక్కడూ కూచుని మందుకొట్టేడు. అయినా సరే, డైరెక్టుగా ఎలా తిట్టేడం? అందులోనూ నేనున్నది అతనింట్లో కదా. స్థానబలం గాని ఆస్థానబలం గాని లేవు నాకు.

"ఔన్రా" అన్నాడు ముకుందం. "ఇదో పెద్ద అవసరమైపోయింది! చస్తున్నాననుకో. ఇంకా నేను నయం. మా అన్నయ్యయితే మరీను. సాయంకాలం నాలుగ్గంటలవడం భయం. పొలోమని పొలంలోకి వెళిపోతాడు, అర్జంటుగా మందు కొట్టాలని అడావిడి పడిపోతాను".

"మీ పొలంలో పర్ణశాల - అదే తాటాకుపాక గెస్టుహౌసు - ఉంది కదూ!" అన్నాను. అక్కడ చాలా ప్రశాంతంగా వుంటుందన్న సంగతి నాక్కూడా తెలుసును.

"ఉంది కానీ, అందులో కూచోడు. వెళ్లడం వెళ్లడమే చేనుకి అడ్డంపడి ఆ సాళ్లలో నడుస్తూ నీపు వెనకాతల కట్టుకుని అవస్తపడతాడు. చూస్తే జాలేస్తుంది" అన్నాడు ముకుందం, ట్రాజెడీ హీరోలాగ శూన్యంలోకి చూస్తూ.

"ఎందుకూ రమ్మన్నావు?" అని అడిగి, "గదిలోకి వెళిపోదామా?" అన్నాను గుట్టుగా, గుసగుసగా.

"అయ్యబాబోయ్, కొంప ముంచేవు కదురా! నీ కాపరంలో నీళ్ళు పొయ్యకపోతే - అన్నట్టు ఏకంగా ఇంటికే తెచ్చేసేవేమిటి సరుకు?" అన్నాడు ముకుందం, అదే గుట్టు శ్రుతిలో.

"నీ మొహంలా వుంది. పిల్చింది నువ్వానూ, సరుకు తేవడం నేనూ నా? పైగా ఇంతసేపూ ఆ గదిలో ఒక్కడివే కూర్చుని అఘోరించింది చాలక ఇప్పుడు నన్ను కూడా ఉద్ధరించడానికి తయారై పోతున్నావా? బావుందిరోయి, నీ వరస! ఇంతకీ అంతా అవగొట్టేసేవా యామైనా మిగిల్చేవా?"

ముకుందం పెద్ద చప్పుడు చేస్తూ నవ్వేడు. "హ హ్హా హ్హా హ్హా" అంటూను.

నాకు నవ్వు రాలేదుగాని, మజ్జిగ గ్లాసు పుచ్చుకుని వస్తున్న కూతురు మాత్రం క్షణంలో మొహం మీదికి చిరునవ్వు తెచ్చుకుంది. తండ్రిగారు మందు కొట్టడం వల్ల ఇంతసేపూ చిరాగ్గా విసుగ్గా పొడి పొడి మాటలాడుతున్నది కాస్తా నవ్వు మొహంతో కనబడేసరికి బాస్ జోక్కి నవ్వే గుమస్తాలు గుర్తొచ్చేరు నాకు.

మజ్జిగ గ్లాసు అందుకుని లేచాడు ముకుందం.

"రా!" అని రెండో చేత్తో నా జబ్బ పుచ్చుకుని లేవదీసుకుపోయాడు, గదిలోకి. టేబిలు మీద ఉన్న ఒక స్ప్రే - పంపు చూపించేడు.

ఇంతసేపూ మందుకొట్టీ, కొట్టీ అలిసిపోయిన ఆ స్ప్రే - పంపు నన్ను చూసి నవ్వినట్టయింది. "దోమల బాధపళ్ళేక-" అంటూ ఆ స్ప్రే పంపూ ఖరీదూ, దాంట్లో నింపే మందు లక్షణాలూ, ఆ డబ్బా విషయంలో తీసుకోవలసిన జాగర్తలూ ముకుందంగాడు విడమర్చి బోధపర్చి చెపుతుంటే ఇంక అక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేక వొచ్చేసాను."

★ ★ ★

"అరె! ఏడున్నరై పోతోందే, టైము!" అని నాగశాస్త్రులు లేచేడు. గుమ్మందాకా వెళ్లి "ఒస్తా, ఎళ్లొస్తా!" అన్నాడు ఒక పాత సినిమాపాట వరసలో.

"మల్లెప్పుడొస్తా?" అన్నాను, అదే వరసలో.

"రేపు మందేళ కొస్తా!" అని పాడుకుంటూ వెళ్ళాడు ఏ ఎస్ వి నాగశాస్త్రులు అనబడే అతిసారా వ్యాధి నాగశాస్త్రులు.

★